www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 19 ఆగస్టు 2025
5
అన్నమయ్య



అందరి సహకారంతో అభివృద్ధి


మాట్లాడుతున్న స్వాతి

ప్రజాశక్తి-గాలివీడు

ప్రజలు, ఉద్యోగుల సహకారంతో డిసిసిబి టర్నోవర్ రూ.100 కోట్లకు చేరువైందని మేనేజర్ సి.స్వాతి పేర్కొన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ డిసిసి బ్యాంకులో రూ. 6 కోట్లకు పైగా డిపాజిట్లున్నాయని పేర్కొన్నారు. బంగారు రుణాలు రూ. 31 కోట్లకు సొసైటీ రుణాలు రూ. 50 కోట్లకు, హౌసింగ్ రుణాలు రూ. ఏడు కోట్లు మంజూరు చేశామని చెప్పారు. ఖాతాదారుల ఆదరణతో సహకార కేంద్ర బ్యాంకు అభివృద్ధి వైపు దూసుకెళ్తుందని తెలిపారు. బ్యాంకులో ఖాతా ఉన్న ప్రతి రైతు, ఎస్‌బి ఖాతాదారుడూ ఆకైవైసి తప్పక అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. బ్యాంకు ఏర్పాటు చేసి పది సంవత్సరాలు దాటిందని, ఖాతాదారులందరూ ఆధార్, ఓటర్‌కార్డ్, పాన్ కార్డ్, ఫొటోను బ్యాంకులో తప్పక సమర్పించాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శివప్రసాద్, సూపర్‌వైజర్ రెడ్డి ప్రసాద్, బ్యాంక్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్ల కత్తిరింపు



జిల్లాలో వికలాంగ పింఛన్లకు భారీగా కోతపడింది. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత బోగస్ వికలాంగ పింఛన్ల ఏరివేతపై దృష్టి సారించింది. జిల్లాలోని వేలా మంది వికలాంగ పింఛనుదారులకు రీ అసెస్మెంట్ పరీక్షల నిర్వహణకు కసరత్తు చేసింది. తొమ్మిది నెలల వ్యవధిలో రెండు దఫాలుగా వికలాంగ పింఛను రీఅసెస్మెంట్ పరీక్షలు నిర్వహించింది. తాజాగా 7,182 మంది వికలాంగ పింఛనుదారులు అనర్హులుగా తేల్చింది. సచివాలయాలు, ఎంపిడిఒ కార్యాలయాల నుంచి పెద్దఎత్తున నోటీసులు జారీ చేసింది. వీటికితోడు మరో 1,585 మందిని వికలత్వ శాతం తగ్గిన వారిగా గుర్తించి ఒఎపి పింఛనుదారులుగా మార్పు చేసింది. ఫలితంగా సెప్టెంబర్ ఒకటిన పింఛన్ చెల్లింపుల కోత, భారీగా చెల్లింపులు నిలిపేయనుండడం ఆందోళన కలిగిస్తోంది.

- 7,182 మందికి నోటీసులు జారీ
- మరో 6,500 మందికి కోత?!
- అత్యధికంగా కడప అర్బన్‌లో 456

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో 37 వేల మంది వికలాంగ పింఛనుదారులు ఉన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం అన్నమయ్య జిల్లాలో బోగస్ పింఛన్లపై ఆరోపణలు రావడంతో మదనపల్లికి చెందిన వైద్యుల పర్యవేక్షణలో రీ అసెస్మెంట్ పరీక్షలు నిర్వహించింది. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ సర్టిఫికెట్లతో పెద్దఎత్తున బోగస్ పింఛన్ పొందుతు న్నట్లు భావించింది. జిల్లాలోని 30 వేల మందికి పైగా రీ అసెస్మెంట్ పరీక్షలు నిర్వహించింది. 2024 నవంబర్ నుంచి 2025 జులై వరకు జిల్లా అధికార యంత్రాంగం కడప జిజిహెచ్, ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి, పులివెందుల ఏరియా ప్రభుత్వాస్పత్రుల్లో నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన వైద్యుల పర్యవేక్షణలో రీఅసెస్మెంట్ పరీక్షలు నిర్వహించింది. అనంతరం వైద్య నిపుణు అందించిన పరీక్షల ఫలితాలను ప్రభుత్వానికి అందజేసింది.

7,182 వికలాంగులకు పెన్షన్ నిలిపివేత

జిల్లాలోని వికలాంగులకు నిర్వహించిన రీఅసెస్మెంట్ పరీక్షల్లో 7,182 మందిని అనర్హులుగా తేల్చింది. 5,173 మంది వికలాంగులు, బెడెడ్ రోగులు 74 మంది, తాత్కాలిక వికలాంగ సర్టిఫికెట్లదారులు 1,889 మంది, తాత్కాలిక సర్టిఫికెట్లు కలిగిన రోగులు 46 మంది వెరసి 7,182 మంది ఉన్నట్లు గుర్తించింది. వీరిలో 40 శాతం నుంచి 85 శాతం లోపు వికలత్వం కలిగిన ఉన్న 60 ఏళ్ల వయస్సు కలిగిన వారికి పింఛన్ల మొత్తాల్లో తగ్గింపు చర్యలు తీసుకుంది. 40 శాతంలోపు వికలత్వం కలిగిన 60 ఏళ్ల లోబడిన వికలాంగులన అనర్హులుగా తేల్చి, పింఛన్ చెల్లింపులను నిలిపేయనుంది.

మరో 6,500 మందికి కోత!?

జిల్లాలోని 7,182 మంది వికలాంగ పింఛన్‌దారులకు పెద్ద ఎత్తున నోటీసులు జారీ చేసింది. జిల్లాలోని 37 వేల మందిలో రీ అసెస్మెంట్ పరీక్షలకు గైహాజ్జరైన మరో ఏడు వేల మంది రీఅసెస్మెంట్ పరీక్షలకు గైహాజ్జరు కావడంతో పరీక్షలను నిలిపేసింది. సుమారు ఏడు వేల మంది రీఅసెస్మెంట్ గైహాజ్జరీల్లో 1,400 మందికి మాత్రమే చెల్లింపులు చేయనుంది. ఈలెక్కన మిగిలిన 6,600 పింఛన్ నిలుపుదల చేయ నుంది. ఈలెక్కన వికలాంగ పెన్షన్ అనర్హుల వివరాలను లెక్కిస్తే 14,182 మంది వికలాంగ పెన్షన్‌దారులకు మొండిచేయి చూపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.


సెప్టెంబర్ చెల్లింపుల్లో కోత!

ఆరోగ్య పరిస్థితుల కేటగిరీ పరిధిలోని వికలాంగులు 408 మంది, 40 శాతంపైన 60 ఏళ్ల వయస్సు కలిగిన 1,177 మందిని ఒఎపి పింఛనుదారులుగా మార్చింది. ఈలెక్కన జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య పరిస్థితుల వికలాంగ కేటగిరీ, ఆరోగ్య పరిస్థితుల సాధారణ రోగుల కేటగిరీ పరిధిలో సుమారు 1,585 మందిని ఓఎపి పింఛన్ దారులుగా పరిగణించనుంది. ఆమేరకు పింఛన్ చెల్లింపుల్లో కోత వేయనుంది.

వైకల్యం తక్కువగా ఉందని నోటీసులు జారీ
- ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తున్న బాధితులు

ప్రజాశక్తి - చాపాడు

ఎన్‌టిఆర్ భరోసా ద్వారా విభిన్న ప్రతిభావంతులకు అందిస్తున్న పింఛన్లలో కోత విధించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2025 ఫిబ్రవరి నుంచి సదరం సర్టిఫికెట్లను పునఃపరిశీలించి వైకల్యంలో 40 శాతం తక్కువగా ఉన్న వారిని గుర్తించి పింఛన్లు తొలగిస్తున్నట్లు నోటీసులు జారీ చేశారు. గతంలో ఎప్పటి నుంచో పింఛను పొందుతూ ఉన్న వారికి కూడా తొలగిస్తున్నట్లు నోటీసులు ఇవ్వడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. కొంతమంది పునఃపరిశీలనకు వెళ్లని కారణంగా పింఛను దూరం కానున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామాజిక పెన్షన్ల పంపిణీలో కోత విధించేందుకు పలు రకాలుగా ప్రయత్నాలు చేపడుతుంతి. పలు దఫాలుగా తనిఖీల పేరుతో పింఛన్లను ప్రతినెలా కొన్ని తగ్గించే ప్రయత్నం చేస్తుంది. అందులో భాగంగా ప్రస్తుతం వెల్ఫేర్ అసిస్టెంట్లు విభిన్న ప్రతిభావంతుల పింఛన్లు తొలగిస్తున్నట్లు నోటీసులు జారీ చేశారు. కొంతమందికి రూ.15వేలు పెన్షన్ నుండి రూ. 6వేలు, రూ. 4వేలకు మార్పు చేస్తున్నట్లు నోటీసులు అందజేశారు. చాపాడు మండలంలోని అన్నవరంలో 14, బద్రిపల్లెలో 30, అయ్యవారిపల్లెలో 8, ఎన్.ఓబాయపల్లెలో 26, చాపాడులో 12, అన్నవరంలో 14, పెద్దగురువలూరులో 4, చిన్నగురువలూరులో 30 మిగిలిన గ్రామాల్లో 120, మొత్తం మండల వ్యాప్తంగా 250కి పైగా పింఛన్లు తొలగిస్తున్నట్లు నోటీసులు జారీ చేశారు. కొంతమందికి ఈనెలలో నగదు పంపిణీ చేయకుండా కోత విధించినట్లు తెలిసింది. నోటీసులు జారీ చేసిన వారికి సెప్టెంబర్‌లో పింఛను పంపిణీ ఉండదని తెలియజేశారు. పక్షవాతం సోకి మంచానికే పరిమితమైన వారికి కూడా పింఛన్లు కోత విధంచడంతో తమకు ప్రభుత్వం చాలా అన్యాయం చేస్తుందని వాపోతున్నారు. అధికారులు పునఃపరిశీలించి అర్హులైన వారికి పింఛన్లలో కోత విధించకుండా చూడాలని కోరుతున్నారు.


పక్షవాతంతో బాధపడుతున్న ప్రకాశం, పింఛను తొలగిస్తున్నట్లు అందించిన నోటీసు

అనర్హత వేటు వేయడం దారుణం



ప్రభుత్వం వికలాంగ పింఛన్‌కు అనర్హత సాకు చూపించడం దారుణం. గతంలో రూ.ఆరు వేల పింఛన్ ఇచ్చి, ఇప్పుడు అనర్హత పేరుతో పింఛన్ తొలగించడం అన్యాయం.

- రావలూరు సావిత్రమ్మ, సోమాపురం, చాపాడు.


అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి: పిజిఆర్ఎస్ అర్జీలకు సకాలంలో, నాణ్యతతో పరిష్కారం చూపాలని కలెక్టర్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజా సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. సిఎం కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షిస్తుందని చెప్పారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని పేర్కొ న్నారు. అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్క రించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్‌-ఎల్‌ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని చెప్పారు. కార్యక్రమంలో జెసి ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి
- ఎపిజిఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ లక్ష్మి ప్రసాద్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ఉద్యోగుల పరిష్కారానికి టీ తాగుతూ చర్చించుకుందామని ఎపిజిఎ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాన్ని అన్వేషిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ నూతనంగా 'టీ తాగుతూ చర్చించుకుందాం' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలకులు ఉద్యోగులకు రావాల్సిన పిఆర్‌సి, అరియర్స్ పట్టించుకోలేదని పేర్కొన్నారు. మూడేళ్ల సరెండర్ లీవ్స్ పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఉద్యోగులను పట్టించుకోని ప్రభుత్వాలు మనకెందుకని మనం నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టామని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పైబడిన ఇంకా ఉద్యోగుల సమస్యలపై స్పందించకపోవడం శోచనీయమని వాపోయారు. ఇప్పటికే ఉద్యోగులకు సుమారు రూ. 25 వేల కోట్లు ప్రభుత్వం బకాయి ఉందని ఈ మొత్తాన్ని ఎలా తీరుస్తారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. సత్వరం ఉద్యోగుల బకాయిల చెల్లింపుకు మార్గాన్ని ఆలోచించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అన్నమయ్య జిల్లా ఉద్యోగులు కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలాజీ, రాయచోటి తాలూకా అధ్యక్షులు ఒ.సాయికుమార్, కార్యదర్శి సుజిత్ డాల్, పెన్షనర్ సంఘం అధ్యక్షులు రాజా, వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతికతపై పట్టు సాధించాలి
- చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీకాంత్


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథి శ్రీకాంత్

ప్రజాశక్తి-మదనపల్లె

ప్రస్తుత కాలంలో విద్యార్థులు టెక్నాలజీపై పట్టు సాధిం చాలని బెంగళూరుకు చెందిన క్సజార్ప్ ల్యాబ్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీకాంత్ కె.అరిమనిత్య అన్నారు. మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో బీ.టెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగ తులను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పరిశ్రమలకు అనుగుణంగా రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని తెలిపారు. విద్యార్థుల ఈ నాలుగేళ్ల ప్రయాణమే వారి వంద సంవత్సరాల భవిష్యత్తును నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. యూనివర్సిటీ అందిస్తున్న ల్యాబ్‌లు, అధ్యాపకుల మార్గదర్శకత్వం, ఇంట ర్న్‌షిప్‌లు, అంతర్జాతీయ సదస్సులను సమయాన్ని సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. యూనివర్సిటీ ప్రో-ఛాన్సలర్ ఎన్.ద్వారకానాథ్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో విద్యార్థులను మిట్స్‌లో చేర్చిన తల్లిదం డ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ మా యూనివర్సిటీలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని తలిపారు. అంతర్జాతీయ స్థాయి ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధన అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, బ్లాక్‌చైన్, మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో పట్టు సాధించాలని పిలుపు నిచ్చారు. అనంతరం ప్రదర్శించిన రియా హ్యూమనాయిడ్ రోబో విద్యార్థు లను ఆకట్టుకుంది. రోబో విద్యార్థులకు యూనివర్సిటీ గురించి వివరిస్తూ, వారి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చింది. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బొప్పాయి వ్యాపారులు కలెక్టర్ ఆదేశాలు పాటించాలి
- సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసనలో ఎఐకెఎస్ నాయకులు



నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బొప్పాయి వ్యాపారులు, షేట్లు కలెక్టర్ ఆదేశించినట్లుగా కిలో రూ.9 నుంచి రూ.10 కనీస ధర అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. బొప్పాయి రైతులకు మద్దతుగా సోమవారం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో సిఐటియు నాయకులు బొప్పాయి రైతులతో కలిసి సంయుక్తంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొప్పాయి రైతులకు కలెక్టర్ నిర్ణయించిన కనీస ధర రూ.9, రూ.10 అమలు చేయాలని, హద్దు దాటిన దళారులపై చర్యలు తీసుకోవాలన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో బొప్పాయి రైతులు నెల రోజులుగా గిట్టుబాటు ధర కోసం ఆందోళన చేస్తున్నారని, దానికి స్పందించి ఈనెల 1న కలెక్టర్ చామకూరి శ్రీధర్ రైతులతోనూ, వ్యాపారస్తులు, షేట్లతో సమావేశమై కనీస ధర రూ.9 నుంచి రూ.10 వరకు అమలు చేయాలని నిర్ణయించారన్నారు. ఈనెల 5 వరకు రూ.9 వరకు అమలు చేసి, 6వ తేదీ నుంచి కలెక్టర్ నిర్ణయాన్ని ధిక్కరించి రూ.8 విక్రయించారని చెప్పారు. ఈనెల 8న సబ్ కలెక్టర్ జోక్యం చేసుకుని దళారులు, రైతులను సమావేశపరిచి రూ.9 కొనసాగించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించిపోయినా పట్టించుకోలేదని వాపోయారు. గేట్లు పెట్టి క్రాస్ చెక్ చేస్తామని, హెల్ప్ లైన్ పెట్టిన దళారులు ప్రభుత్వ ఆదేశాలు అమలు చేయకుండా రూ.7కు తగ్గించి రైతుల్ని మోసం చేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. కలెక్టర్ నిర్ణయించిన రూ. 10 అమలు చేయాలని, ధిక్కరించిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సూటు పేరుతో రైతుల నుంచి టన్నుకు 100 కేజీలు రద్దు చేయాలన్నారు. పే స్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూడు, నాలుగు నెలలకు పట్టీలు వేస్తున్నారని, రైతులను మోసం చేస్తున్నారని, కచ్చితంగా రైతు పేరు, దళారి పేరు, లారీ నెంబరు, కాటా టన్నులు, ధర, గ్రామము, మండలం పేరుతో రైతులకు రసీదులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బొప్పాయి మండీలకు లైసెన్స్ విధానం అమలు చేయాలని కోరారు. దళారుల సిండికేట్ అయ్యి ధర తగ్గిస్తున్నారని, ప్రభుత్వం జోక్యం చేసుకొని మార్కెట్ ద్వారా కనీస ధర రూ. 15 నిర్ణయించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలపై సబ్ కలెక్టర్‌తో చర్చించగా వెంటనే అధికారులతో సమావేశమై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పటి దాకా హెచ్చరిక మాత్రమే జారీ చేశామని, ఇకముందు యాక్షన్ ప్లాన్ అమలు చేసి కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు పంది కాళ్ళ మణి, రైతు సంఘం చిట్వేలు మండలం కన్వీనర్ ఆదినారాయణ, కో - కన్వీనర్ శివకృష్ణ చౌదరి, ఈశ్వరయ్య, వెంకటరత్నం, మనోహర్, రైల్వేకోడూరు రైతు సంఘ నాయకులు సుబ్బరాజు, కె.బాల, వి.హరిబాబు, ఓబులవారిపల్లి మండల నాయకులు శివ కుమార్‌వర్మ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్


నీటిని విడుదల చేసేందుకు వెళుతున్న కలెక్టర్, జెసి, నాయకులు

ప్రజాశక్తి-టి.సుండుపల్లె

పింఛా ప్రాజెక్టు జలాశయం నుండి నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం పింఛా ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండి పొంగిపొర్లుతున్న దృష్ట్యా జలహారతితో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, టిడిపి నాయకులు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు తదితరులతో కలిసి కలెక్టర్ నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పింఛా ప్రాజెక్టుకు భారీ ఎత్తున వరద నీరుతో పింఛా ప్రాజెక్ట్ నిండిన నేపథ్యంలో పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. పింఛా ప్రాజెక్టు కెపాసిటీ 327.60 టిఎంసిలకు చేరుకుందన్నారు. ప్రాజెక్టు నుండి కిందకు నీటిని విడుదల చేయడంతో కుడి కాలువ ఆయకట్టు ద్వారా 2,211 ఎకరాలకు, ఎడమ కాలువ ఆయకట్టు ద్వారా 1,562 ఎకరాలకు మొత్తం 3,773 ఎకరాలకు సాగు, తాగునీటి అవసరాలకు నీటిని అందిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలకు సాగు, తాగునీటికి ఎటువంటి సమస్య ఉండదన్నారు. వర్షాల కారణంగా వరద ముప్పును తగ్గించడానికి ఫ్లడ్ గేట్లను అర అడుగు మేర ఎత్తడం జరిగిందని కుడి, ఎడమ కాలువకు సంబంధించిన చెరువులకి నీటిని విడుదల చేశామని తెలిపారు. ఎడమ కాలువకు సంబంధించిన చెరువులకు నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు దిగువన ఉన్న గ్రామాల ప్రజలు, పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. నీటి విడుదల జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎస్ఇ వెంకటరామయ్య, డిఇ చెంగల్ రాయులు, తహశీల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛా ప్రాజెక్టు నుంచి నీటి విడుదల

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు : సిఐ


మాట్లాడుతున్న సిఐ రాఘవరెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సర్కిల్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వాల్మీకిపురం సిఐ రాఘవరెడ్డి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో రోడ్లపైన పుట్టిన రోజు వేడుకలను నిర్వహించకూడదన్నారు. అర్ధరాత్రి సమయంలో బాణాసంచా పేల్చడం వంటివి చేయకూడదన్నారు. ప్రజలను ఇబ్బంది కలిగించే విధంగా ఎవరైనా వ్యవహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొంత మంది అల్లరి మూకలు ద్విచక్రవాహనాలపై కేరింతలు కొడుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తప్పవన్నారు. అలాగే సర్కిల్ పరిధిలో వినాయక చవితి విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేసి, ఏదైనా ప్రమాదాలు, గలాటాలు జరిగితే విగ్రహ కమిటీపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. విగ్రహాల వద్దకు మద్యం సేవించి రాకూడదన్నారు. వినాయక చవితి పండుగను శాంతియుతంగా, ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. నిమజ్జనం సమయంలో శబ్దకాలుష్యం, మద్యం సేవించడం, బాణాసంచా పేలుళ్లు, గలాటాలు పడడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటివి చేయకూడదన్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా ఉత్సవాలు జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎక్కడైనా ఏదైనా అసాంఘీక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక కార్యక్రమాలు, ఆందోళన కలిగించే అంశాలపై తమకు సమాచారం అందించాలన్నారు. సిఐ రాఘవరెడ్డి 9440796714కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది లక్ష్మీపతి, అబ్దుల్లా, రిజ్వాన్, నరేష్ నాయక్ పాల్గొన్నారు.


కలెక్టెట్ వద్ద నిరసన చేపడుతున్న బిఎస్‌పి నాయకులు

బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి
- బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు యుగంధర్

ప్రజాశక్తి - రాయచోటి

రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు అబ్బువరం యుగంధర్ పేర్కొన్నారు. సోమవారం బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్ చామకూరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతం కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బిసిలకు వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో 50 శాతం శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు బిసిలను మోసం చేస్తున్నాయని, రాజ్యాధికారం బహుజన్ సమాజ్ పార్టీ ద్వారానే సాధ్యమని తెలియజేశారు. బిసి కోసమే ఈ దేశంలో ఈ రాష్ట్రంలో బహుజన్ సమాజ్ పార్టీ పనిచేస్తుందని అందుకే రాష్ట్రంలో ఉన్న బిసిలందరూ ఏకతాటిపై వచ్చి బహుజన్ సమాజ్ పార్టీని ఆదరించి బెహన్ కుమారి మాయావతిని ప్రధానమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అడ్వైజర్ బుసపోగుల ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి పెదవీటి నరసింహులు, రాయచోటి అసెంబ్లీ అధ్యక్షులు అబ్బువరం నాగేశ్వర్, మహిళా నాయకులు ప్రియా, రూప బి.ఎస్.పి, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ దందాలపై విచారణ చేపట్టాలి : వైసిపి



ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్న నిస్సార్ అహమ్మద్

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణం చుట్టూ చోటు చేసుకుంటున్న భూ కుంభకోణం, భూ దందాలు, ఫేక్ పట్టాలపైన న్యాయ విచారణ చేపట్టి, అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇంటి పట్టాలివ్వాలని, ఇచ్చే వరకు మదనపల్లెలో పేదల పక్షాన వైసిపి పోరాటం చేస్తుందని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు. సోమవారం మదనపల్లె మున్సిపాలిటీ 6, 25 వ వార్డులలో నిస్సార్ అహమ్మద్ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. కూటమి ఏడాది పాలనలో సూపర్ సిక్స్ పథకాల అమలు పైన ప్రజల నుంచి నిస్సార్ అహమ్మద్, వైసిపి నాయకులు వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబునాయుడు మోసం చేస్తున్నారని విమర్శించారు. మదనపల్లె పట్టణం, పరిసర ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ భూములకు కొంతమంది దళారులు ఫేక్ పట్టాలను సృష్టించి, పేదలకు అంటగట్టి మోసం చేస్తున్నారని ఆరోపించారు. అనపగుట్ట, కోళ్ళబైలు, జగన్ కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, పోతబోలు పంచాయతీలలో దళారుల పెత్తనం తారా స్థాయికి చేరడంతో భూ కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. గత 10, 15 ఏళ్ల కిందట పని చేసిన తహశీల్దార్ల సంతకాలతో పట్టాలు సృష్టించి, ఇవి తమవే అంటూ మోసాలకు పాల్పడుతున్నారన్నారని, ఫేక్ పట్టాలపైన, పాత తహశీల్దార్లు ఇచ్చిన పట్టాలపైన విచారణ కమిటీ వేసి నకిలీ పట్టాలను ఏరి వేసి, ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించడంతో పాటు నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దళారులు ప్రభుత్వ స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించుకుని రూ.5 నుంచి 30 లక్షల వరకూ అమ్ముకుంటూ పేదలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మదనపల్లె చుట్టూ జరుగుతున్న ఈ భూస్కాం పైన జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని కోరారు. అర్హులైన వారికి న్యాయం చేసే వరకు వైసిపి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్న దాతలు

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కలకడ

ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువు మానేయాలన్న ఉద్దేశంతో ఉన్న విద్యార్థికి పి4 బతుకమ్మ ద్వారా ఆర్థిక మండలంలోని కదిరాయచెరువుకు చెందిన బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న పవన్‌కుమార్‌కు ఆర్థిక దాతలు సాయమందించారు. గ్రామ సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న, ఆమె భర్త కమలనాథ్, పంచాయతీ కార్యదర్శి ఆర్.ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో బంగారు కుటుంబాల కార్యక్రమం కింత రూ.66 వేల ఆర్థిక సాయం అందజేశారు. సర్పంచ్ రూ.10 వేలు, తొగట వీర క్షత్రియ సంఘం ఉపాధ్యక్షులు రామిశెట్టి రత్నమయ్య రూ.20 వేలు, జక్కల శ్రీనివాసులు రూ.20 వేలు, డిస్టిక్ సర్వేయర్ రామిశెట్టి వెంకటరత్నం రూ.16 వేలు సాయం చేశారు. పేద కుటుంబాలను బంగారు కుటుంబం తీసుకుని గ్రామంలో ఇంకా ఎవరైనా ఉంటే వారికి ఆర్థిక సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ విశ్వనాథ్‌శెట్టి, స్కూల్ కమిటీ చైర్మన్ జోగేంద్ర, వైస్ సర్పంచ్ గోపాల్ నాయుడు, మల్లికార్జున, రమణ, రెడ్డప్ప, కృష్ణ, శివకుమార్, రాజశేఖర్, రెడ్డప్ప, చెన్నారాయుడు గ్రామస్తులు పాల్గొన్నారు.

తలసేమియా బాధితుడికీ...

ప్రజాశక్తి- రామాపురం


సాయం పత్రంలో బాధిత చిన్నారి

మండలంలోని నీలకంఠరావుపేటకు చెందిన పఠాన్ జాబీర్ అహమ్మద్ కుమారుడు షకీల్ అహమ్మద్ అనే బాలుడు తలసేమియా వ్యాధితో బాధపడు తున్నాడు. చికిత్స కోసం లక్షలాది రూపాయలు అవసరం కాగా ఆర్థిక స్థోమత లేకపోవడంతో బాలుడి తండ్రి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని ఆశ్రయించారు. ఆయన వెంటనే స్పందించి బాలుడి మెడికల్ రికార్డులను ఎంపీ మిథున్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసును ప్రధానమంత్రి జాతీయ ఉపశమన నిధి పరిధిలోకి తీసుకెళ్లి తగిన ఆర్థిక సహాయం అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ కూడా వెంటనే స్పందిస్తూ, షకీల్ మెడికల్ డాక్యుమెంట్లు, సంబంధిత ధ్రువపత్రాలను ప్రధానమంత్రి కార్యాలయానికి పంపించారు. ప్రధాన మంత్రి కార్యాలయం నేరుగా బెంగుళూరులో షకిల్ చికిత్స పొందుతున్న భగవాన్ మహావీర్ జైన్ ఆస్పత్రికి రూ.3 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా షకీల్ తల్లిదండ్రులు స్పందిస్తూ ఆర్థిక సాయం అందేలా కృషి చేసిన మాజీ ఎమ్మెల్యేకు, ఎంపీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎన్‌టిఆర్ అభిమానులకు పోలీసుల కౌన్సెలింగ్

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

సినీ హీరో, జూనియర్ ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులను సోమవారం ఒకటో పట్టణ పోలీసులు స్టేషన్ తరలించారు. జూనియర్ ఎన్టీఆర్ పై అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ కీలక వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో మదనపల్లెలోని ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు నిరసన తెలిపేందుకు ప్రయత్నించారు. ఈ మేరకు స్థానిక ఎన్‌టిఆర్ కూడలిలో నిరసన తెలిపేందుకు వెళుతుండగా సమాచారం అందుకున్న ఒకటో పట్టణ పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా నిరసనలు తెలపడం, ధర్నాలు చేయడం, ర్యాలీలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఎక్కడో జరిగిన ఓ సంఘటనను తీసుకొని ఇలా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా నిరసనలు చేపట్టడం తగదన్నారు. ఈ విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి స్పందించారని ఇంతటితో ఈ విషయాన్ని వదిలేయాలని ఎన్‌టిఆర్ ఫ్యాన్స్‌కు ఎస్‌ఐ శివకుమార్ రెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు.


అన్నదానం చేస్తున్న ప్రసాద్‌బాబు

అన్నదానం గొప్పది : 'సుగవాసి'

ప్రజాశక్తి - రాయచోటి

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు సుగువాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని గాలివీడు రోడ్డు మార్గమధ్యలో ఉన్న గంగమ్మ ఆలయంలో తన కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి, విగ్రహ ప్రతిష్టాపన చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు సంధ్య ఎంపిక

ప్రజాశక్తి-తంబళ్లపల్లి



మండలంలోని కన్నెమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన టి.సంధ్య జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు అన్నమయ్య జిల్లా షూటింగ్ బాల్ అసోసి యేషన్ కన్వీకర్ నరేష్‌బాబు, జిల్లా కార్యదర్శి గౌతమి, ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ సెక్రటరీ పరశురాముడు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 25, 26వ తేదీల్లో వశిష్ట ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలల్లో పాల్గొని మంచి ప్రతి కనభకనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయా ప్రాంతంలో జరిగే 44వ జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటుందని హెడ్మాస్టర్ మదన్ మోహన్. పీడీ ఖోదన్ బాషా తెలిపారు. సంధ్య ఎంపికపై గ్రామస్థులు, ఎస్ఎంసి చైర్మన్ రెడ్డిశేఖర, సర్పంచ్ హర్షం వ్యక్తం చేశారు.

దుర్గంధభరితం.. పాత బస్టాండ్ ఆవరణం

- ఎక్కడ చూసినా మద్యం సీసాలు, గ్లాసులు
- విసుగు చెందుతున్న ప్రయాణికులు, ప్రజలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని పాత బస్టాండు కూడలి సమీపంలోని చలపతి కాంప్లెక్స్ వద్ద రోజూ మద్యం సీసాలు, గ్లాసులు గుట్టలుగా పోస్తూ ప్రజలను అసౌకర్యానికి గురి చేస్తున్నారు. రైల్వేకోడూరు, తిరుపతికి వెళ్లే ప్రయాణికులతో పాటు గ్రామీణ ప్రాంతాలకు ఆటోలలో వెళ్లే వారితో ఆ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. చలపతి కాంప్లెక్స్ పక్క సందు అనేక వ్యాపార సముదా యాలు న్నాయి. నిత్యం సరిగ్గా అక్కడే ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు మధ్యం సీసాలు, గ్లాసులు గుట్టలుగా వేస్తుండడంతో జన సందోహంతో కూడిన ఆ ప్రాంత ప్రజలు, ప్రయాణికులు, వ్యాపారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోజూ పారిశుధ్య కార్మికులు వచ్చి రోడ్లు ఊడ్చి శుభ్రం చేసి వెళ్లిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు అక్కడ చెత్తను పడేస్తున్నారు. మరుసటి రోజు వరకు ఆ చెత్త అక్కడే ఉంటూ ప్రజల అసహనానికి కారణమవుతోంది. మద్యం సీసాలు, గ్లాసులు పడేస్తున్న ప్రాంతానికి అతి సమీపంలోనే రెండు మద్యం దుకాణాలున్నాయి. ఆ దుకాణాదారులే ఈ చెత్తను అక్కడ పడేస్తున్నారా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనా నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో ఇలా మద్యం సీసాలు, గ్లాసులు వేస్తూ ప్రజలను అసౌకర్యానికి గురి చేస్తున్న వారిని గుర్తించి పురపాలక శాఖ చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


గుట్టగా వేసిన మద్యం సీసాలు, గ్లాసులు

సేంద్రియ వ్యవసాయ పంటలతో ఆరోగ్యం : ఎఒ


ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎఒ నాగమణి

ప్రజాశక్తి-రామాపురం

ఆర్గానిక్ కూరగాయల వాడకం ఆరోగ్యానికి మంచిదని మండల వ్యవసాయధికారి నాగమణి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయ స్థాయిలో నిర్వహిస్తున్నటువంటి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను సోమవారం ఆమె పరిశీలించారు ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వాడకం పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు రసాయనిక క్రిమిసంహారక మందులు వాడకం లేని ఆర్గానిక్ ఉత్పత్తులు వాడడం వల్ల ఆరోగ్యానికి శ్రేయస్కారమని చెప్పారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన స్టాళ్ల వద్ద మండల ప్రజలు రద్దీ పెరగడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయాధికారులు శ్రీదేవి, వెంకటరామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కిరణ్, కదిరునిసా, రెడ్డమ్మ, వెంకటరమణ పాల్గొన్నారు

తంబళ్లపల్లి: ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యదాయకం, లాభదాయకమని ఎపిఎం గంగాధర్ అన్నారు. ఎంపిడిఒ ఆఫీస్ ఆవరణలో సోమవారం ఎపిసిఎన్ సిబ్బంది పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను ప్రారంభించారు. సేంద్రీయ ఎరువులు వాడకం వల్ల ఆరోగ్యకరమైన పంట దిగుబడులతో పాటు భూసారం కూడా పెరుగుతుందన్నారు. మహిళా సంఘాల సహకారంతో ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు.

కొత్త భవనంలోకి ఒపిడి సేవలు

ప్రజాశక్తి-కలికిరి

ఒపిడి సేవలను కొత్త భవనంలోకి మార్పు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పవన్ తెలిపారు. ఎమ్మెల్యే కిషోర్ కుమార్‌రెడ్డిచే సామాజిక ఆరోగ్య కేంద్రం కొత్త భవనాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. కలికిరి సామాజిక ఆరోగ్య కేంద్రంను ఆసుపత్రి కమిటీ సభ్యులు డాక్టర్ వెంకట్రమణారెడ్డి సందర్శించి ఎమ్మెల్యే సూచనల మేరకు ఇపిడి సేవలు కొత్త భవనంలోకి మార్పు చేయవలసిందిగా వైద్యాధికారులకారులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ వై.పవన్ కుమార్‌తో కలిసి ఆసుపత్రికి వచ్చే రోగులకు అంకిత భావంతో సేవలు చేయాలని, సాదరంగా మసలుకోవాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. పాత భవనం మరమ్మతులో ఉండటం వల్ల తాత్కాలికంగా కొత్త భవనంలో మాత శిశు వైద్య సేవలు, ఎక్స్‌రే, ల్యాబ్ సేవలుతో పాటు ఒపి సేవలు, వార్డ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఆస్పత్రికి విచ్చేసిన రోగులు కొద్ది రోజులు సహకరించవలసిందిగా తెలిపారు. పాము కాటుకు, కుక్క కాటుకి సంబంధించన మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గుండె నొప్పికి సంబంధించిన రూ.40 వేలు విలువ చేసే టెనెక్టప్లేస్ ఇంజెక్షన్ అందుబాటులో ఉందని చప్పారు. గుండె నొప్పి వచ్చినప్పుడు ఇసిజి తీసుకొని అవసరమైతే వైద్యులు ఆ ఇంజెక్షన్ ఇస్తారని, ఈ సదుపాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్ కిరణ్, డాక్టర్ ఆశాలత, డాక్టర్ శశి కుమార్ రాజు, డాక్టర్ అన్వేష్, డాక్టర్ సిమ్రన్, హెడ్‌సిస్టర్ వనజ, రేడియోగ్రాఫర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యాధికారి పవన్ కుమార్

టీకాలతో పిల్లల ఆరోగ్యం పదిలం

ప్రజాశక్తి-పీలేరు

టీకాలతో పిల్లల అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టొచ్చని, ప్రమాదకరమైన బాల్య వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తలుపుల పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శ్రీగిరీష తెలిపారు. రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఈనెల 18 నుంచి 23 వరకు తలుపుల పిహెచ్‌సి పరిధిలో పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు ఇచ్చే ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. సోమవారం పీలేరు పట్టణంలోని ఓ పాఠశాలలో 5,10 ,16 ఏళ్ల వయస్సు పిల్లలకు డిపిటి, టిడి వంటి వ్యాధినిరోధక టీకాలు వేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో వైకల్యాలు, తీవ్ర అనారోగ్య సమస్యలు, మరణాల్ని పూర్తిగా నిర్మూలించవచ్చని అన్నారు. కార్యక్రమాన్ని అన్ని ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాక్సినేషన్ చేస్తారన్నారు. సూక్ష్మ ప్రణాళికననుసరించి వందశాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆమె తమ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు కృష్ణయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-కలికిరి

గుండ్లూరు గ్రామానికి చెందిన ఆకుల సుబ్రహ్మణ్యం చెరువును ఆక్రమించినట్లు అదే గ్రామానికి చెందిన విఆర్.వెంకటేశ్వర్‌రెడ్డి తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గుండ్లూరు గ్రామంలోని ఎగువ ఆకులకుంట చెరువులోనికి ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరిందని, కానీ ఆకుల సుబ్రహ్మణ్యం ప్రభుత్వ భూమిని ఆక్రమించి చదును చేసి టమోటా పంట వేసినారని, సదరు తోట ఊటు పట్టుచున్నదని చెరువు యొక్క తూమును తీసివేసి నీరును వృధాగా వదిలివేశారని, ఇంకను మిగిలిన చెరువులోని నీటిని జెసి బితో కాలువ తీసి చెరువు మరో పక్కన లోతుగా కాలువ తీసి నీటిని చెరు వులో నిలువ లేకుండా తన స్వలాభం కోసం వృధా చేస్తున్నాడని, తహశీల్దార్ పరిశీలించి చెరువు కట్ట తూమును మట్టితో పూడిపించి ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకుని దీనిపై తగు చర్య తీసుకుని ఆయికట్టు భూమికి సాగు అవసరాలకు నీటిని చెరువులో నిలువ ఉండేలా చేయవలెనని కోరారు.

దోబీఘాట్ల మంజూరుకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో పెరిగిన రజక జనాభా అనుగుణంగా రజకులకు నూతన దోబీఘాట్ల మంజూరుకు ప్రభుత్వం ప్రతిపాదనలు కోరిందని ఉమ్మడి కడప జిల్లా బిసి కార్పొరేషన్ ఇడి జయసింహ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపిడిఒ సురేష్ బాబు అధ్యక్షతన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన రజకుల సమావేశంలో ఇడి మాట్లాడుతూ ప్రభుత్వం నూతన దోభిఘాట కోసం రూ.10 లక్షలు, పాత దోభిఘాట్ మరమ్మతు కోసం రూ.3 లక్షలు మంజూరుకు ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రజక సంఘ అధ్యక్షులు టి.రమేష్ బాబు మాట్లాడుతూ గాలివీడు, బండపల్లె, పొత్తుకురుపల్లె, రాయుడు కాలనీ వద్ద కొత్త దోభీఘాట్లు ఏర్పాటు చేస్తే రజకులకు సౌలభ్యంగా ఉంటుందని రాతపూర్వకంగా వినతిపత్రం అందించారు. గున్నికుంట్ల రోడ్డు, దుల్లవా రిపల్లె వద్ద ఉన్న దోభిఘాట్లు మరమ్మతు చేయించి, ఆక్రమణకు గురికా కుండా రక్షణ కంచె ఏర్పాటు చేయించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలలో రజకులకు ప్రాధాన్యం కల్పించా లన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ఎం.వి రమణ, వి.శ్రీనివాసులు, బాలరాజు, రెడ్డయ్య, నటశేఖర్, ఆనంద్, రామ్మూర్తి, రమణ పాల్గొన్నారు.


ఇడికి వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘం నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్ కుమార్‌రెడ్డి

ఆలయ అభివృద్ధికి సమష్టి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పీలేరు

ఆలయ అభివృద్ధికి సమష్టి కృషి అవసరమని పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి సమక్షంలో శ్రీశ్రీశ్రీ రౌద్రాల అంకాళమ్మ ఆలయ నూతన పాలకమండలి చైర్మన్, సభ్యుల చేత దేవాదాయ శాఖ అధికారిణి మంజుల ఆలయ కమిటీ చైర్మన్ కె.రామకృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు పి.పోతయ్య, కె.శాంతకుమారి, ఎన్.నాగరత్నమ్మ, కె. చంద్రలేఖ, కె.అనసూయమ్మ, పామిడి మహాలక్ష్మి, కె.రామయ్య, కె.వెంకటరమణ, ఎస్.హరీష్ బాబు, జి.వెంకటరమణ, పి.భాస్కర్‌రెడ్డిల చేత సామూహిక ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాల్గొన్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ కమిటీ చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులకు శ్రీశ్రీశ్రీ రౌద్రాల అంకాళమ్మ కరుణ, కటాక్షంతోనే ఈ పదవులు దక్కాయని, అందరుకలసి ఆలయ అభివ ృద్ధికి కృషి చేసి, ఆలయ ప్రతిష్టను పెంచాలని అన్నారు. ఈ అవకాశాన్ని అందరు కలసి సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ పదవుల్లో రెండేళ్ల పాటు కొనసాగుతారని, ఆ తర్వాత కొత్తవారికి అవకాశం కల్పిస్తామని, ప్రతి ఒక్కరూ సమన్వయం పాటించాలని చెప్పారు. కొత్తగా ఎన్నికైన ఆలయ కమిటీ చైర్మన్ కోడి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సాయశక్తులా, శక్తి వంచన లేకుండా తనవంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించి ఈ గొప్ప అవకాశం కల్పించిన ఎమ్మెల్యే, కూటమి శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

గుడి స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడండి

ప్రజాశక్తి-పీలేరు

మాతమ్మ ఆలయ స్థలం దురాక్రమణకు గురికాకుండా కాపాడాలని ఎమ్మార్పీఎస్ పీలేరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్ విజ్ఞప్తి చేసుకున్నారు. సోమవారం పీలేరు తహశీల్దారు శివకుమార్, ఎంపిడిఒ శివశంకర్‌లను కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల కోసం అమలు చేసే సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందడంలేదని, దళితుల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములు దురాక్రమణకు గురికాకుండా చూస్తూ, వాటిని అనుభవంలో ఉన్న దళితులకే అనుభవ అనుభవ పత్రాలను కేటాయించాలని కోరారు. పీలేరు పట్టణం బండ్ల వంకలో వెలసిన శ్రీ మాతమ్మ తల్లి ఆలయం వద్ద తమ అనుభవంలో ఉన్న ప్రభుత్వ స్థలం గుడి అవసరాల నిమిత్తం కేటాయిస్తూ అనుభవ పత్రం మంజూరు చేయాలని బండ్ల వంక వాసులు, ఎంఆర్‌పిఎస్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు బండ్ల వంక పివి రమణ, టి.వెంకటరమణ, చంద్రయ్య, మురళి, శ్రీనివాసులు, చరణ్, నరసింహ, అన్నవరం, భాస్కర, కుమార్ బండ్ల వంక వార్డ్ మెంబర్ ఎస్ స్వర్ణ, నివాసులు కె.నాగ మునెమ్మ, భూదేవి, భారతి, దేవి, లక్ష్మీదేవి, అంజమ్మ, లలిత, రత్నమ్మ ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలను పునఃప్రారంభించాలని ఎంపిడిఒ, ఎంఇఒలను కోరుతున్న గ్రామస్తులు

ఉర్దూ పాఠశాలను పునఃప్రారంభించండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని సింగంవారిపల్లెలో ఉన్న ఉర్దూ పాఠశాలను పునఃప్రారంభించాలని గ్రామస్తులు సోమవారం ఎంపిడిఒ రమేష్‌బాబు, ఎంఇఒ పద్మావతిలకు వినతి పత్రం అందించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో మార్పులను చేసిన విషయం తెలిసిందే. కొన్ని ప్రాంతాలలో మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేసి దానికి సమీపంలోని ప్రాథమిక పాఠశాలలోని 3 నుంచి 5వ తరగతి విద్యార్థులను ఈ పాఠశాలలకు అనుసంధానం చేసింది. ప్రాథమికోన్నత పాఠశాలలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలగా ఉన్నతీకరించింది. సింగంవారిపల్లెలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులను సమీపంలోని పాఠశాలలకు కేటాయించింది. వాస్తవానికి సింగంవారిపల్లెలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో 14 మంది విద్యార్థులు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుకుంటున్నారన్నారు. అయితే గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఇటీవల ఈ పాఠశాలలో విద్యార్థుల హాజరును జీరో చూపించి పాఠశాలను మూసివేసారని గ్రామస్తులు ఎంపిడిఒ, ఎంఇఒల దృష్టికి తీసుకు వచ్చారు. సింగంవారిపల్లెలో ఉర్దూ ప్రాథమిక పాఠశాల 35 సంవత్సరాల నుంచి ఉందని, ఇక్కడ ఎంతోమంది విద్యార్థులు చదువుకున్నారన్నారు. ఇప్పటికీ మా పిల్లలను ఇక్కడే చదివిస్తున్నామని, ప్రస్తుతం ఇక్కడ పాఠశాల అందుబాటులో లేదని తెలిసి ఆశ్చర్యానికి గురయ్యామన్నారు. ఇక్కడి నుంచి విద్యార్థులు వేరే పాఠశాలకు వెళ్లి చదువుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఉర్దూ పాఠశాలను తిరిగి ప్రారంభించాలని ఎంపిడిఒ, ఎంఇఒలను అభ్యర్థించారు. ఎంపిడిఒ రమేష్ బాబు, ఎంఇఒ పద్మావతితో చర్చించి ఉర్దూ ప్రాథమిక పాఠశాలను వెంటనే తిరిగి ప్రారంభించి అక్కడి విద్యార్థులను అక్కడే చదువుకునేలా సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంఇఒ మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలను సింగంవారిపల్లిలో తిరిగి ఏర్పాటు చేయిస్తామని గ్రామస్తులకు తెలిపారు.



ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మీనరసింహను సన్మానిస్తున్న బ్యాంకు సిబ్బంది

సన్నిహితంగా ఉన్నప్పుడే గౌరవం పెరుగుతుంది

ప్రజాశక్తి - గాలివీడు : ప్రజలందరితో సన్నిహితంగా ఉన్నప్పుడే గౌరవం పెరుగుతుందని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఫీల్డ్ ఆఫీసర్ బి. విజయకుమార్ అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్. లక్ష్మీ నరసింహ ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ మొలకలచెరువుకు బదిలీ అవుతున్న సందర్భంగా ఆయన్ను సన్మానించారు. అనంతరం సిబ్బంది, ఖాతాదారులు, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో క్యాషియర్ శ్రావణ్, క్లర్క్ రెడ్డి ప్రసన్న, పి. హిమబిందు, మెసెంజర్ కృష్ణ నాయక్, విశ్వనదారెడ్డి, మనోహరరెడ్డి, సిబ్బంది, ప్రజలు, పలువురు పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-మదనపల్లె: మదనపల్లిలోని రెడ్డి సంక్షేమ సంఘం 2025 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని నియమించింది. తాజా నియామకాల ప్రకారం, సంఘం గౌరవ సలహాదారులుగా డాక్టర్ పి.ద్వారకనాథరెడ్డి, సి.తిమ్మారెడ్డి నియమితులయ్యారు. అధ్యక్షుడిగా కనుగొండ మద్దిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా గుండ్లూరు దేవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కంభం నాగభూషణ్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా పి.ప్రసాద్‌రెడ్డి నియమి తులయ్యారు. న్యాయ సలహాదారులుగా ఆవుల శివరామిరెడ్డి, కంచి మంజునాథరెడ్డి నియమితులయ్యారు. కోశాధికారిగా ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, సమన్వయకర్తగా పి.రామ మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కార్యవర్గ సభ్యులుగా టి.రాజారెడ్డి, డి.మల్‌రెడ్డి, ఎస్.రెడ్డిప్పరెడ్డి, ఎన్.సురేందర్‌రెడ్డి, జి.రామకృష్ణారెడ్డి, డి.రవి చంద్రారెడ్డి, పి.నరేంద్ర కుమార్‌రెడ్డి, పి.హరినాథ్‌రెడ్డి, ఆర్.శివ కుమార్‌రెడ్డి, ఎం.దామోదర్‌రెడ్డి, ఎం.విజయ్ కుమార్ రెడ్డి, పి.ప్రసాద్‌రెడ్డి, రెడ్డి ప్రసాద్‌రెడ్డి, టి.జయచంద్రారెడ్డి వ్యవహరిస్తారు.


మాట్లాడుతున్న నూతన కమిటీ సభ్యులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు దుర్మరణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంలో వెళ్తున్న హెూంగార్డును లారీ ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తంబళ్లపల్లి మండలం, కోటకొండ తండా కు చెందిన ఈశ్వర్ నాయక్(50) గత 18 ఏళ్లుగా పోలీసుశాఖలో మదనపల్లెలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈశ్వర్ నాయక్ భార్య లక్ష్మీబాయితో పాటు కుమారుడు హర్షవర్ధన్ నాయక్, కుమార్తె భవ్యశ్రీతో కలిసి మదనపల్లె పట్టణంలోని సొసైటీకాలనీలో నివాసం ఉంటున్నాడు. సొంతపనిమీద ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళ్ళిన ఈశ్వర్ నాయక్‌కు సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాత్రి విధులు కేటాయించడంతో విధుల్లో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంలో స్వగ్రామం నుంచి బయలుదేరాడు. మార్గమధ్యంలోని ముదివేడు క్రాస్ వద్ద సిమెంట్ లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈశ్వర్ నాయక్ మృతితో కుటుంబం వీధిన పడింది. చదువుకుంటున్న పిల్లలు అనాధలయ్యారు. ప్రభుత్వం ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

భార్య కాపురానికి రాలేదని, భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం రామసముద్రం మండలంలో చోటు చేసుకుంది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కనగానిపల్లె పంచాయతీ, చొక్కాండ్లపల్లికి చెందిన సుబ్రహ్మణ్యం భార్య హేమలత 15 రోజుల కిందట కుటుంబ సమస్యలపై గొడవపడ్డారు. దీంతో హేమలత అలిగి పుంగనూరు మండలం, బట్టందొడ్డిలో ఉన్న పుట్టింటికి వెళ్ళిపోయారు. పలుమార్లు కాపురానికి రావాలని పిలిచినారావకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన సుబ్రహ్మణ్యం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో ఐసియూకు తరలించి చికిత్స అందిస్తున్నారు. రామసముద్రం పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.